## శిథిలావస్థలో ఓపెన్‌జిమ్‌లు



2



2

## ఆలయ నిర్మాణానికి భూమిపూజ

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

27-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కను డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఘనంగా సన్మానించారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా శిక్షణా శిబిరంలో ఆమె తన ప్రజంటేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆమెను వారు ఘనంగా సన్మానించారు.

## కవిత కడిగిన ముత్యం : సూదం లక్ష్మి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై జాగృతి రాష్ట్ర నాయకురాలు సూదం లక్ష్మి స్పందించారు. రాజకీయ కుట్రలో భాగంగా కవితపై కేసు పెట్టి ఎంతో క్షోభకు గురిచేశారని సూదం లక్ష్మి అన్నారు. కేసులో ఐదున్నర నెలల పాటు జైలులో గడపాల్సి వచ్చిందన్నారు. కానీ చివరకు న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకం నిలబడిందని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నాయకత్వంలో మరింత ముందుకెళ్తామని సూదం లక్ష్మి తెలిపారు. త్వరలో కవిత స్థాపించనున్న పార్టీ రాబోయే రోజుల్లో అద్భుతమైన విజయాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల్లోకి వెళ్లేందుకు శాయశక్తులా పనిచేస్తామని చెప్పారు. కవిత నాయకత్వంలో పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తున్న నాయకురాలు కవిత అని పేర్కొన్నారు.

## ఎన్ని ఇబ్బందులొచ్చినా చదువుకోవాలి



**అక్షర టుడే, ఇందూరు:** ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదువును అర్ధఅంతరంగా నిలపొద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో శానిటరీ ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్యాడ్లను ఏడాది పాటు పునర్వినియోగం చేసుకోవచ్చని వాడిన అనంతరం శుభ్రపరచుకొని ఆరబెట్టుకోవాలని సూచించారు. నెలసరి విషయంలో బాలికలు ఆందోళనకు లోను కావద్దని ప్రకృతి సహజంగా జరిగే పరిణామం అన్నారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం, పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని, బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం, గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మహేశ్వరం, లీడ్ బ్యాంకు మేనేజర్ సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయరెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 314 మంది విద్యార్థుల గైర్హాజరు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం మొదటి సంవత్సరం పరీక్షలు రెండోరోజు కొనసాగాయి. మొత్తం 9,572 మంది విద్యార్థులకు గాను 9,258 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 314 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.



# గోదావరి పుష్కరాలకు ప్రణాళికే కీలకం..

■ ఘాట్ల వద్ద పరిస్థితులపై అధికారుల సర్వే ■ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ ■ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

**గోదావరి పుష్కరాలు వచ్చే ఏడాది జులైలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పుష్కర ఘాట్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. దేవాదాయ, నీటిపారుదల శాఖ, పంచాయితీ రాజ్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులపై సర్వేలు చేస్తున్నారు. ఆయా నివేదికలను ప్రభుత్వానికి త్వరలో సమర్పించనున్నారు. ఆ నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయనుంది. ప్రధానంగా రహదారులు, పుష్కర ఘాట్ల మరమ్మతులు, తాగునీటి వసతులు, పార్కింగ్ తదితరంశాలపై దృష్టి సారించారు. –అక్షరటుడే, ఇందూరు**

ప్రతి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలు వస్తుంటాయి. గోదావరి నదికి 2015లో పుష్కరాలు వచ్చాయి. మళ్లీ 2027లో జులై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్నాయి. దీంతో అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించనున్నారు. జిల్లాలో లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర అధికారులు, కలెక్టర్ సంబంధిత అధికారులతో పలుమార్లు సమావేశాలు సైతం నిర్వహించారు.

### కందకుర్తి వద్ద..

గోదావరి నది మహారాష్ట్ర నుంచి తెలంగాణలో మొదటగా నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. రెంజల్ మండలంలోని కందకుర్తిలో (త్రివేణి సంగమం) ప్రవేశించి బాసర, భద్రాచలం మీదుగా ఆంధ్రప్రదేశ్ లోకి వెళ్తుంది. అయితే ప్రభుత్వం బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకునేలా ప్రణాళికను రూపొందిస్తుంది. పుష్కరాలకు వచ్చేవారు దేవాలయాలతో పాటు మార్గమధ్యలో ఉన్న పర్యాటక అందాలు తిలకించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

### జిల్లాలో పుష్కర ఘాట్లు

మహారాష్ట్ర నుంచి గోదావరి నది తొలుత నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో నది తీరం సుమారు 140 కిలోమీటర్ల ఉంటుంది. అయితే జిల్లాలో మొత్తం 11 స్థలాల్లో 15 పుష్కర ఘాట్లు ఉన్నాయి. కందకుర్తి, తాడబిలోలి, కోస్లి, తుంగిని, బినోల, ఉమ్మెడ, పోచంపాడు, సావేల్, తడపాకల్, దోంచందా, గుమ్మిర్యాల్‌లో ఘాట్లు ఉన్నాయి. ఇప్పటికే ఇక్కడ కావలసిన సౌకర్యాలు, మరమ్మతులు, నిర్మాణాలు, పార్కింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులు నివేదికను సిద్ధం చేశారు. ప్రధానంగా కందకుర్తి త్రివేణి సంగమం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకునే అవకాశం ఉంటుంది. ఈ పుష్కర ఘాటును ఆదర్శ ఘాట్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రం నుంచి బాసర కేవలం 35 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో భక్తులు అటువైపు కూడా ఎక్కువగా వెళ్లే అవకాశం ఉంది.

### అధికారుల సమన్వయం..

పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలంటే అన్ని శాఖల అధికారుల సమన్వయం ఎంతో అవసరం. ప్రధానంగా దేవాదాయ శాఖతో పాటు నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్, రవాణా శాఖ కీలక పాత్ర పోషించాల్సి వస్తుంది. ఇప్పటికే దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సైతం సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, స్వయంగా జిల్లాలోని పలు పుష్కర ఘాట్లను పరిశీలించారు. సౌకర్యాలు ఏర్పాట్లు నిర్మాణాలు మరమ్మతులపై పలు సూచనలు చేశారు. ఇప్పటినుంచి పనులన్నీ ప్రారంభించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

### నివేదికలను సిద్ధం చేస్తున్నాం

జిల్లాలో మొత్తం 11 ప్రాంతాల్లో పుష్కర ఘాట్లు ఉన్నాయి. ఇక్కడ అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం పనులు కొనసాగుతాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి మెరుగైన సౌకర్యాలను కల్పిస్తాం.

– **విజయరామరాజు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయ శాఖ**

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని మైనారిటీ పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో ఆమె తహశీల్దార్ రమేష్, ఎంపీడీవో గంగాధర్, ఎంఈవో నరేందర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, వంటశాలను పరిశీలించి ఆహార నాణ్యత, పరిశుభ్రతపై అధికారులతో చర్చించారు. భోజనం రుచి, నాణ్యత ఎలా ఉన్నాయనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారికి అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత, పోషకాహారం, హాజరుశాతం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు సైతం కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంబరాలు..



**అక్షరటుడే, ఇందూరు:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జాగృతి అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ నిజం గెలిచిందన్నారు. సంబంధం లేని కేసులో కవితను ఇరికించి ఆమెను ఇన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందన్నారు. చివరకు విజయం కవిత వైపే నిలిచిందన్నారు.

## అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై పురోగతి సాధించాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని కలెక్టరేట్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్తి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని సూచించారు. అమృత్ 2.0 కింద కొనసాగుతున్న యూజీడీ పనులు నీటి సరఫరా, ప్రగతినగర్ శ్మశానవాటిక, రామర్తి చెరువు సుందరీకరణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల స్థితి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మరమ్మతులు, ఇందిరమ్మ ఇళ్లకు నిధుల విడుదల, వీధి దీపాల నిర్వహణ, దెబ్బతిన్న రోడ్ల ప్యాచ్ వర్క్, రూ.5 కోట్ల ప్రత్యేక నిధుల వినియోగం, రూ.32 కోట్ల యూఐడీఎఫ్ జంక్షన్ అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ప్రధానమంత్రి శ్రీ నిధి నిధుల వినియోగం, మాతాశిశు సంక్షేమ ఆస్పత్రి, బస్తీ దవాఖానాల పనితీరుపై సమీక్షించారు. ఎన్‌హెచ్ఎం నిధుల వినియోగం అక్రమ వైద్యులపై చర్యలకు నివేదికలు అందజేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ట్రాఫిక్ నిర్వహణ సిగ్నల్స్ పనితీరు, రోడ్డు ఆక్రమణలపై చర్యలు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి విషయంలో అర్బన్ నియోజకవర్గంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా నిత్యం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతి పై దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా వేసవి కాలంలో తాగునీటి సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సేంద్రియ వ్యవసాయం చేయడం అభినందనీయం

**అక్షరటుడే, ఇందూరు:** కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సేంద్రియ వ్యవసాయం చేయడం అభినందనీయమని టెలి కమ్యూనికేషన్ కేంద్ర జాయింట్ సెక్రెటరీ దేవేంద్ర కుమార్ రాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎం శ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. పర్యావరణం పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకొని ఇతరులకు తెలియజేయాలన్నారు. అనంతరం స్మార్ట్ క్లాస్ రూమ్‌లు,, డిజిటల్ ల్యాబ్‌లు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, శుద్ధి చేసిన తాగునీరు, శౌచాలయాలను, క్రీడా వసతులను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పిఎం శ్రీ పథకం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విజయలక్ష్మి, శ్రీనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## తండాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



**భీమ్‌గల్, అక్షరటుడే:** గిరిజన తండాల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో నడవాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రహత్ నగర్ గ్రామంలో సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'భోగ్ బండారు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### తండాల అభివృద్ధికి అంకితం

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ ఆజన్మ బ్రహ్మచారిగా ఉండి, సుమారు 500 తండాలు తిరుగుతూ గిరిజనుల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఆయన త్యాగనిరతిని స్మరించుకుంటూ, పార్టీలకు అతీతంగా ఈ ఉత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించుకోవాలన్నారు. ఈ వేడుకల నిర్వహణకు నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేయాలని సూచిస్తూ, తన వంతుగా రూ. 50 వేల విరాళాన్ని ప్రకటించారు.

### విద్య, సంక్షేమానికి పెద్దపీట

ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా బాల్కొండ నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ కృషితో ఈ పాఠశాల మంజూరైందని, దీనివల్ల గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.

కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తిరుపతి, ఉప సర్పంచ్ సేవాలాల్, వీడీసీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, భీమ్‌గల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ బొదిరే నాగమణి, తహశీల్దార్ మొహమ్మద్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, వివిధ విభాగాల అధికారులు, బంజారా నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్ గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణం కోసం శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామస్థుడు సంకోజి లక్ష్మీనారాయణ, ఆయన కుమార్తె స్వరూప భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత అభివృద్ధి చెందుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తిని దేవరాజ్, కట్కం రాజేశ్వర్, బసవయ్య, చంద్రమౌళి, యాదగిరి గౌడ్, సంగీత్ గోపి గౌడ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాధాకృష్ణ పాఠశాలలో ఆయుర్వేద వైద్య శిబిరం




**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఆర్య సమాజ్ రాధాకృష్ణ పాఠశాలలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, ఆహార నియమాల, యోగా, దినచర్య, రుతుచర్యల గురించి వివరించినట్లు జిల్లా ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి జె. గంగాదాస్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు అనిత, సునీత, ఆయుష్ విభాగం ఫార్మాసిస్టులు న్యావనంది పురుషోత్తం, ఉమాప్రసాద్, ఆయూష్ సిబ్బంది రమేష్, భిక్షపతి, మహేష్, ఉపాధ్యాయులు నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగంపేటలో తెలుగు ప్రతిభా పరీక్ష



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో అంజల్ రెడ్డి బహుమతులను అందజేశారు. విజేతలు దీపికా యాదవ్ (భవానీపేట), సుగంధిని (శెట్‌పల్లి సంగారెడ్డి), మీనాక్షి (నల్లమడుగు), తేజస్వి (కేజీబీవీ లింగంపేట)లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అంజల్ రెడ్డి, శెట్‌పల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం వసుధ, వివిధ పాఠశాల హెచ్‌ఎం, తెలుగు భాషా బోధకులు పాల్గొన్నారు.

## 'మన ఇసుక వాహనం' సేవలు ప్రారంభం



**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని సుంకినిలో శుక్రవారం 'మన ఇసుక వాహనం' సేవలు ప్రారంభించారు. తహశీల్దార్ గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సర్పంచ్ షాజీ పటేల్ వాహనదారులతో కలిసి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ట్రాక్టర్లు ఇసుక బుక్ చేసుకోగా వారికి శుక్రవారం అనుమతించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ బుకింగ్ యాప్ విధానాన్ని సుంకినిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మ్యానువల్ విధానానికి స్వస్తి పలుకుతూ ఇక నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ ఉంటుందన్నారు. వాహనదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇసుక అవసరం అయిన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాహనదారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఓపెన్‌జిమ్‌లు..



నగరంలో ఓపెన్‌జిమ్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. నగర పరిధిలో 30 ప్రాంతాల్లో ఐదారేళ్ల క్రితం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో జిమ్ ఏర్పాటుకు సుమారు రూ.10లక్షల వరకు ఖర్చయ్యింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం చాలామంది ఈ జిమ్‌లలో వ్యాయామం చేసేవారు. రానురానూ వాటిని పట్టించుకునేవారు కరువవడంతో పరికరాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వ్యాయామాలు చేసేందుకు వచ్చేవారిని గాయపరుస్తున్నాయి. ఓపెన్‌జిమ్‌లో మ్యాట్లు సైతం పూర్తిగా లేచిపోవడంతో వ్యామాయాలు చేసేవారికి ఇబ్బందిగా మారింది. నగరంలోని పాలిటెక్నిక్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన జిమ్ నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్






## కోనాపూర్ పాఠశాలలో సైన్స్ మేళా



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనాపూర్‌లో ముందస్తుగా సైన్స్ మేళా ఏర్పాటు చేశారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కుప్పం ఆధ్వర్యంలో పాఠశాలకు అందజేసిన సైన్స్ కిట్ పరికరాలతో తయారు చేసిన ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. 6వ తరగతి నుంచి పది వరకు జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టుల్లో 100 ప్రయోగాలను విద్యార్థులు తయారు చేశారు. మానవ అస్తిపంజరం నమూనా, పుర్రె, లేజర్ లైట్, ఆహారపు గొలుసు , వివిధ రకాల జంతువుల చిత్రాలు, బ్యాటరీ, కాంతి అనువర్తనాలు మొదలైనవి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు రామకృష్ణ, భాస్కర్, రాజా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడి మృతి



**అక్షరటుడే, లింగంపేట:** పీఆర్టీయూ మండల అధ్యక్షుడు, లింగంపల్లి కుర్దు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీందర్ శర్మ బ్రెయిన్ స్ట్రోక్‌తో గురువారం రాత్రి మృతి చెందారు. లింగంపేట మండలంలో పీఆర్టీయూ సంఘానికి భీష్మ పితామహుడుగా పేరుపొందాడు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు వచ్చిన ముందుకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించేవారని ఆయనకు పేరుంది. 37 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అందరి చేత మన్నలను పొందారు. రవీందర్ శర్మ పౌరోహిత్యంలో కూడా ఎన్నో పెళ్లిళ్లు, శుభకార్యాలను జరిపించారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన ఆయన అందరికీ సుపరిచితుడు కావడంతో లింగంపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

### రోదించిన విద్యార్థులు

లింగంపల్లి కుర్దు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ శర్మ మృతి చెందడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన మృతదేహాన్ని చూసి రోదించారు. ఒక మంచి ఉపాధ్యాయుని కోల్పోయామని సర్పంచ్ ప్రత్యూష సాయిరాం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన సేవలను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. టీచర్లు, అధికారులు రవీందర్ శర్మ కుటుంబానికి సంతాపం తెలిపారు.

## ముప్కాల్ ఎంఈవోగా మొగిలి గంగారాం బాధ్యతలు స్వీకరణ



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండల ఎంఈవోగా మొగిలి గంగారాం పదవీబాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ముప్కాల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన గంగారాంనకు పలువురు ఉపాధ్యాయులు, సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ముప్కాల్, రెంజర్ల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం రవి కుమార్, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొండ్రు నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్, ప్రసాద్, లక్ష్మణ్, శ్రీనివాస్, నరేష్, సురేష్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి రాజేశ్వర్ ఉన్నారు.

## గిరిజనుల కుటుంబాల్లో విద్యుత్ వెలుగులు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని గిరిజన కుటుంబా ల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు ట్రాన్స్‌కో కృషి చేస్తోందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. డీఏజేజీఏ పథకం ద్వారా విద్యుత్ లేని గిరిజన కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ పథ కంలో భాగంగా జిల్లాలో 83 మంది గిరిజనుల ఇళ్లకు, 378 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నాన్నామన్నారు. ఈ మేరకు మాక్లూర్ మండ లం సింగం పల్లి తండాలో కొత్తగా ఎల్టీ లైన్లు, పోల్స్ వేసి సుమారు 13 గ్రామాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ కన్‌స్ట్రక్షన్ తోట రాజశేఖర్, సర్పంచ్ శాంతాబాయి, గ్రామ పెద్దలు జైరాం నాయక్, ఏఈ కన్‌స్ట్రక్షన్ కాశీనాథ్, ఏఈ ఆపరేషన్ మిథున్ పాల్గొన్నారు.

## వేంపల్లిలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ముంతాజుద్దీన్, సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లయ్య, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ధనేష్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### రెంజర్లలో..



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో అర్హులైన ఎనిమిది మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ముజీబొద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య భూమేశ్వర్, ఉప సర్పంచ్ రాజేందర్, వార్డ్ సభ్యులు, డీసీసీ ప్రెసిడెంట్ చిన్నరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ పట్టాదారుడికి సన్మానం



**అక్షరటుడే, గాంధారి:** మండలలోని సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ పెద్దబూరి సత్యంను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ పేదరికాన్ని జయించి కష్టపడి చదివి సత్యం తెలంగాణ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందినందుకు గర్విస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బిస గణేష్, ఉపాధ్యక్షుడు రవీందర్, సర్పంచ్‌లు నాగేష్, బంగారు శంకర్, సుధాకర్, అనిల్, సంతోష్, మమ్మాయి రేణుక సంజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## మట్టికుండల తయారీని పరిశీలించిన విద్యార్థులు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు మట్టికుండలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కుల వృత్తుల్లో భాగంగా మట్టి కుండల తయారీ విధానంపై విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మండల కేంద్రంలోని శాలివాహన కుమ్మరి వారి దగ్గరికి వెళ్లారు. మట్టి కుండల తయారీని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కుండలు తయారు చేసే విధానాన్ని కుమ్మరివారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సైతం మట్టి కుండలను తయారుచేసేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పర్యావరణ ప్రకృతిని కాపాడడంలో భాగంగా ప్రస్తుత కాలంలో అందరూ మట్టికుండల పాత్రలను వదిలి నాన్‌స్టిక్ పాత్రలు ఫ్రిజ్‌లో వాడటం వల్ల అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మట్టికుండలపై అవగాహన కల్పించాలని ఆదేశాలు ఇచ్చిన క్రమంలో మట్టి కుండలు తయారీని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## సిలిండర్ పేలి వృద్ధురాలికి తీవ్రగాయాలు

**అక్షరటుడే, బాన్సువాడ:** గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వర్ని మండలం నెహ్రూ నగర్ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లూరి భూలక్ష్మి గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రపోయారు. ఉదయం ఇంట్లో స్విచ్ ఆన్ చేయగానే.. గ్యాస్ లీకేజీ కారణంగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడుతో ఫ్రిజ్‌తో పాటు సిలిండర్ దెబ్బతిని ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో భూలక్ష్మికి తీవ్రంగా కాలిన గాయాలు కాగా.. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నిజామాబాద్‌కు తరలించారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.